
ప్రజాశక్తి
గురువారం 7 నవంబర్ 2024 | 5 | అనంతపురం





ప్రజాపోరు కరపత్రాలను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజా సమస్యలపై 'సిపిఎం ప్రజాపోరు'

- 8 నుండి 14 వరకు ఇంటింటి ప్రచారం
- సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై దాడులు, అత్యాచారాలు, జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ తదితర ప్రజా సమస్యలపై సిపిఎం 'ప్రజాపోరు' నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలియజేశారు. ఇందులో భాగంగా ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఇంటింటా ప్రచార కార్యక్రమం చేస్తున్నట్లు తెలియజేశారు. 14న కలెక్టరేట్‌తో పాటు, మండల కార్యాలయాల వద్ద ప్రజలతో కలిసి ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి ప్రచార కార్యక్రమం కరపత్రాలను బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ గత నెలరోజులుగా కూరగాయలు, నిత్యావసర వస్తువులు, వంటనూనెల ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. పండుగల సందర్భంగా, రోజువారి సరుకుల కొనుగోళ్లలో ధరల ప్రభావం కనిపిస్తోందన్నారు. రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులను సరసమైన ధరలకు అందించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల అదుపునకు అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు వస్తాయని ఎదురుచూస్తున్న యువత నిరాశకు గురవుతోందని ఇలాంటి తరుణంలో డీఎస్సీ వాయిదా పడటం దుర్మార్గం అన్నారు. గ్రూప్-1, గ్రూప్-2 సైతం అగమ్యగోచరంగానే ఉన్నాయన్నారు. కోచింగ్ తీసుకున్న యువత అయోమయంలో ఉన్నారని చెప్పారు. వెంటనే రిక్రూట్‌మెంట్ ప్రారంభించి ఉద్యోగాలు, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు రోజురోజుకూ పెరుగుతున్నాయన్నారు. ఆచూకీ కనపడని ఆడపిల్లల సంఖ్య పెరుగుతోందన్నారు. గత ప్రభుత్వానికి భిన్నమైన పాలన అందిస్తామన్న కూటమి వాగ్దానాలు అమలులోకి రాలేదన్నారు. ఇసుక, మద్యం మాఫియాలు చెలరేగిపోతున్నాయని విమర్శించారు. ఉచిత ఇసుక విధానం నేటికీ అమల్లోకి రాలేదన్నారు. భవన నిర్మాణ కార్మికులు, రవాణా వాహన యజమానులు, కార్మికులు, ర్యాంపులలో కార్మికులు, నిర్మాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మద్యం షాపులు విచ్చలవిడితనం, సమయాలు పెంచడం, బెల్టుషాపులకు తెరదీయడం సరికాదన్నారు. మద్యాన్ని నియంత్రించాల్సింది పోయి ఇలా పెద్ద ఎత్తున అమ్మకాలు చేయడం ప్రజా ఆదాయం, ఆరోగ్యాన్ని కొల్లగొట్టడమే అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూనే ట్రూఅప్ ఛార్జీల పేరుతో 20 వేల కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై వేసిన భారాలను ఉపసంహరించుకోవాలన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రయత్నాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇక జిల్లాలో సాగునీటి వనరులకు రూ.7వేల కోట్ల నిధులు కేటాయించాలన్నారు. ఈ సమస్యలన్నింటిపై సిపిఎం ప్రజాపోరు కార్యక్రమంలో ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జి.ఓబులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.నాగేంద్ర కుమార్, ఎం.బాలరంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు రామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటనారాయణ, నాగమణి, జగన్ పాల్గొన్నారు.

విద్యార్థుల కన్నెర్ర



ఎస్‌ఎఫ్‌ఐ నాయకున్ని బలవంతంగా ఈడ్చుకెళ్తున్న పోలీసులు



అనంతపురం కలెక్టరేట్ వద్ద బైటాయించి నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు



ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్‌ను బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు

- ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి
- స్కాలర్‌షిప్పులు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్
- విద్యార్థి సంఘం నాయకుల అరెస్టు, విడుదల
- విద్యార్థులను రోడ్డుపై ఈడ్చిపారేసిన పోలీసులు
- పోలీసుల తీరుపై ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల ఆగ్రహం

స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన బాటపట్టారు. ఫీజుల విడుదలలో ప్రభుత్వ తీరుపై కన్నెర్ర చేస్తూ కలెక్టరేట్‌ను ముట్టడించారు. వందలాది మంది విద్యార్థులు కలెక్టరేట్ ఎదుట బైటాయించారు. పెండింగ్ స్కాలర్‌షిప్పులు, ఫీజులు విడుదల చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలని ఖాళీ ప్లేట్లు చేతబట్టుకుని నిరసన తెలిపారు. ఈ సమయంలో పోలీసులు ఆందోళనను అడ్డుకున్నారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులను బలవంతంగా రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లి పోలీసు జీపుల్లోకి విసిరేశారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరును పలువురు ఖండించారు.

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలని, విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో అనంతపురంలో చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. సంగమేష్ సర్కిల్ నుంచి విద్యార్థులతో కలిసి ప్రదర్శన చేపట్టారు. ప్రదర్శనలో స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం నిధులు విడుదల చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద బైటాయించి నినాదాలు చేశారు. అప్పటికే అక్కడ మోహరించిన పోలీసులు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులను అడ్డుకున్నారు. కలెక్టరేట్ వద్ద నుంచి వెళ్లిపోవాలంటూ బెదిరింపునకు దిగారు. ఈ సమయంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, పోలీసులకు మధ్య వాదోపవాదాలు జరిగాయి. తాము విద్యార్థి సమస్యలపై శాంతియుతంగా ఆందోళనను చేస్తున్నామని, తమను అడ్డుకోవద్దంటూ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ పోలీసులకు తెలిపారు. అయినా పోలీసులు వినకుండా బలవంతపు అరెస్టులకు ఉపక్రమించారు. కలెక్టరేట్ ఎదుట బైటాయించిన వారందరినీ బలవంతంగా ఈడ్చుకుంటూ వెళ్లి పోలీసు జీపుల్లోకి విసిరేశారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిద్ధు, ఓతూరు పరమేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శి బంగి శివ, రాష్ట్ర కమిటీ సభ్యుడు వైటిసి.రమేష్, రజిత తదితరులను బలవంతంగా అరెస్టు చేసి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు, అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే ఇలా బలవంతపు అరెస్టులు చేయడం అప్రజాస్వామికం అని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మండిపడ్డారు.

హామీలు అమలు చేయమంటే అరెస్టులా..?

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిద్ధు, ఓతూరు పరమేష్

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగంలో ఉన్న సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హామీ ఇచ్చారని, ఆ హామీలను అమలు చేయమని ప్రశ్నిస్తే బలవంతంగా అరెస్టులు చేయడం దుర్మార్గం అని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఓతూరు పరమేష్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. చలో కలెక్టరేట్ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా పెండింగ్‌లో ఉన్న రూ.3,480కోట్ల విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలు విడుదల చేయలేదన్నారు. ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అప్పు తెచ్చి ఫీజులు కట్టాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చారని, ఇంతవరకు అమలు చేయలేదన్నారు. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌ఛార్జీలు 3 వేలకు పెంచాలన్నారు. మండల కేంద్రాల్లో ఏపీ మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేయాలన్నారు. తల్లికి వందనం కింద ఇస్తానన్న రూ.15వేల విడుదల చేయాలని కోరారు. డిగ్రీలో మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఉన్నత విద్యను దూరం చేసే జీవో నెంబర్ 77 రద్దుచేసి, పీజీ విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పందించకుంటే విద్యార్థులతో కలిసి చలో అసెంబ్లీ ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. అనంతరం డిఆర్‌ఓను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ స్థానిక సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించేలా విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతా మన్నారు. ఇందుకోసం కలెక్టర్, విద్యాశాఖ అధికారులతో రెండు రోజుల్లో చర్చలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు వైటిసి.రమేష్, రజిత, బంగి శివ, జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, తరిమెల గిరి, జిల్లా సహాయ కార్యదర్శులు వెంకటేష్, రాచపల్లి సూర్య ప్రకాష్, శివ, భీమేష్, జిల్లా కమిటీ సభ్యులు సోము, గణేష్, మహేష్, నందు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సాయి, విజయ్, ధన, దామోదర్, విజయ్, వలి, ఆదర్శ్, తేజ, జాన్సన్, జయకష్ణ, ధనుష్, విద్యార్థులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లోకి వెళ్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను బలవంతంగా అడ్డుకుంటున్న పోలీసులు

పీఏబీఆర్ సామర్థ్యం 11 టీఎంసీలకు పెంచాలి : కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పీఏబీఆర్ రిజర్వాయర్ సామర్థ్యం 5 టీఎంసీల నుంచి 11 టీఎంసీలకు పెంపుదల చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం నగరంలోని బుడ్డప్ప నగర్‌లో ఉన్న టిబి హెచ్‌ఎల్‌సి కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. కూడేరు మండలంలోని పీఏబీఆర్ రిజర్వాయర్‌కు సంబంధించి పెండింగ్ భూసేకరణ, నిధులు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని కూడేరు మండలంలో ఉన్న పీఏబీఆర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 5 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉండగా, పూర్తిస్థాయి నీటి నిలువ 11.10 టీఎంసీల సామర్థ్యానికి పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. పీఏబీఆర్ రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటి నిలువ 11.10 టీఎంసీల వరకు నీటిని నిల్వ చేయాలంటే ఇంకా మొత్తం 3,026 ఎకరాల భూ సేకరణ కావాల్సి ఉందన్నారు. ఉరవకొండ మండలం మైలారంపల్లి, పెద్దకౌకుంట్ల, రాకెట్ల, బెలుగుప్ప మండలంలోని కోనంపల్లి, బూదిగుమ్మ, అంకంపల్లి గ్రామాల పరిధిలో కూడేరు మండలంలోని ఎంఎం.హళ్లి, జయపురం, కొర్రకోడు గ్రామాల పరిధిలో భూ సేకరణ చేపట్టాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించి మొత్తం నివేదికను తయారుచేసి అందజేయాలని ఆదేశించారు. పీఏబీఆర్ రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటి నిల్వ కోసం అవసరమైన భూసేకరణ వివరాలు, ఇప్పటివరకు ఎంత భూమి సేకరించారు, ఇంకా ఎంత భూమి సేకరించాల్సి ఉంది, ఎంత నిధులు అవసరమవుతాయి... అనేదానిపై ప్రతిపాదనలు తయారుచేసి వాటర్ రిసోర్స్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్‌కు జిల్లా కలెక్టర్ నుంచి ఒక లేఖ పంపించాలన్నారు. పీఏబీఆర్ రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటి నిల్వ కోసం ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కళ్యాణదుర్గం ఆర్డీవో వసంత బాబు, హెచ్‌ఎల్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమేష్ రెడ్డి, డిటి అనురాధ, సీనియర్ అసిస్టెంట్ వెంకటలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ అచ్యుత, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బి.అజితకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి -అనంతపురం



బి.అజిత

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో సుదీర్ఘ పరిశోధనలు చేసిన బి.అజితకు అనంతపురం జెఎన్‌టియు యూనివర్సిటీ బుధవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈమె అనంతపురం జెఎన్‌టియు సివిల్ ఇంజినీరింగ్ విభాగం సీనియర్ ఆచార్యులు, అనంతపురం జెఎన్‌టియు ఇన్‌ఛార్జి ఉపకులపతి హెచ్.సుదర్శన రావు పర్యవేక్షణలో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో "ఏ స్టడీ ఆన్ ది ఎఫెక్ట్ అఫ్ ఆల్ 2ఓ3 నానో పార్టికల్స్ ఆన్ వర్కబిలిటీ, స్ట్రెంగ్త్ మరియు డ్యూరబిలిటీ, క్యారెక్టరిస్టిక్స్ అఫ్ హై స్ట్రెంగ్త్ కాంక్రీట్" అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ పరిశోధనకు డాక్టర్ బి.అజితకు జెఎన్‌టియు యూనివర్సిటీ డాక్టరేట్ (పిహెచ్‌డి) ప్రదానం చేసింది. పరిశోధక విద్యార్థి బి.అజిత అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల సివిల్ విభాగంలో అధ్యాపకురాలుగా, సివిల్ విభాగం విభాగ అధిపతిగా పనిచేస్తున్నారు. డాక్టరేట్ పొందిన బి.అజితను ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య హెచ్.సుదర్శన్ రావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, పలువురు అధ్యాపకులు అభినందించారు.

టీటీడీ ఛైర్మన్ బిఆర్.నాయుడును కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డ్ నూతన ఛైర్మన్ బిఆర్.నాయుడు, కమిటీ సభ్యులను అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి బోర్డు కమిటీ సభ్యుడిగా నియమితులైన మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజును కలిశారు. ఎమ్మెల్యేతో పాటు హిందూపురం ఎంపీ పార్థసారథితో కలసి బిఆర్.నాయుడుని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాలక మండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డిలను మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు రాయల్ మురళి, రామలింగారెడ్డి, టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటప్ప, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, టిడిపి నాయకులు రాంప్రసాద్, దరూర్ ఓబుల్ నాయుడు హాజరయ్యారు.



బిఆర్.నాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ బికె

రెసిడెన్షియల్ శిక్షణను రద్దు చేయాలి : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



డిఇఒ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాలను తక్షణమే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, ఎస్.సిరాజుద్దీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్ బాబును కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా ఆరిగిపల్లిలో జరుగుతున్న లీడర్షిప్ ట్రైనింగ్‌లో ఓ ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందారన్నారు. ఉపాధ్యాయులపై ఆరు రోజులకు పైగా ప్రభుత్వం చేస్తున్న తీవ్రమైన మానసిక ఒత్తిడి మూలంగా ఈ సంఘటన జరిగిందన్నారు. జిల్లాకు ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, నాన్ రెసిడెన్షియల్ విధానంలో ఈ శిక్షణలు ఇవ్వాలని, ఈ శిక్షణా కార్యక్రమాలు ప్రారంభించక ముందే దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న సీనియర్ ఉపాధ్యాయులు, మహిళా ఉపాధ్యాయులు, వికలాంగ ఉపాధ్యాయులు ఇబ్బంది పడతారని విన్నవించామని తెలిపారు. ఇప్పటికైనా జిల్లాలో జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ లీడర్‌షిప్ శిక్షణ కార్యక్రమాలు తక్షణమే నిలుపుదల చేయాలన్నారు. ఒకవేళ నిర్వహించదలిస్తే జిల్లాకి ఒకటి చొప్పున నిర్వహించాలని, అది కూడా నాన్ రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు సర్దార్ వలి, వెంకటరమణ, జిల్లా నాయకులు కలీముల్లా, హనుమంతు, మన్సూర్ అలీ పాల్గొన్నారు.

మిషన్ లర్నింగ్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం, ఏఐసీటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడు రోజుల సదస్సులో భాగంగా బుధవారం రెండో రోజు పరిశోధకులు డాక్టర్ శ్రీనాథ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మిషన్ లర్నింగ్, డీప్ లర్నింగ్ ప్రాథమిక సూత్రాలను పరిగణలోకి తీసుకుని వాటి అమల్లో వివిధ పద్ధతులను తెలియజేశారు. మోడల్స్, ట్రైనింగ్, డేటా ప్రాసెసింగ్, రియల్- టైమ్ అనువర్తనాలు వంటి అంశాలపై ప్రాక్టికల్ డేమోస్ ద్వారా వివరించారు. డాక్టర్ దర్శన్ గెరా కన్వల్యుషనల్ న్యూరల్ నెట్వర్క్స్ (సిఎన్ఎన్) అంశంపై సీన్స్ ఎలా పనిచేస్తాయో మరియు వాటి వినియోగం, వాటిని అర్థం చేసుకునేందుకు చేయాల్సిన ద్ధతులను ఉదాహరణలతో తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కో ఆర్డినేటర్‌గా ఆచార్య ఏపీ శివకుమార్ వ్యవహరించారు.

సమైక్యతా శిబిరానికి ఎస్కెయు విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం

గుజరాత్‌లో ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకూ జరిగే జాతీయ సమైక్యతా శిబిరంలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఎస్కెయు ఎన్ఎస్ఎస్ విభాగం నుంచి 11 మంది పాల్గొంటారని విసి ప్రొఫెసర్ అనిత తెలిపారు. వారికి విసి అనిత, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ మురళీధర్ శుభాకాంక్షలు తెలిపారు. శిబిరంలో అన్ని విభాగాల్లో ప్రతిభ చాటి మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఈ బృందానికి కంటెంజెంట్ ఇన్‌ఛార్జిగా డాక్టర్ కోనంకి శ్రీధర్ వెళ్తున్నారు. ఎంపికైన వాలంటీర్ల వివరాలు.. బి.అమృత(ఆర్ట్స్ కాలేజీ), డి.రాఘవి(కెఎస్ఎన్), బి.నవ్యశ్రీ(ఎస్కెయు ఫార్మసీ), ఎ.లోహిత(ఎస్‌వి), ఎం.సాయిహర్షిత(ఎస్ఎస్‌పిఆర్, హిందూపురం), అబ్దుల్ రెహ్మాన్ (రాయ దుర్గం), టి.మంజునాథ్ (ఎస్‌బివివి, హిందూపురం), యు.పవన్(ఎస్‌కెపి, గుంతకల్లు), జికె. రఘువర్ధన్ (ఎస్‌వైటిఆర్, మడకశిర), కె.ధనుష్(కెహెచ్ డిగ్రీ కాలేజీ, ధర్మవరం).

డీఎస్సీ నోటిఫికేషన్ వాయిదా అన్యాయం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

డీఎస్సీ నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేయడం అన్యాయంగా ఉందని డిఐఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వై.బాలక్రిష్ణ, నూరుల్లా తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ డీఎస్సీ వాయిదాతో డీఎస్సీ అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. 5 నెలల నుంచి పల్లె ప్రాంతాల నుంచి పట్టణాలకు వచ్చి కోచింగ్‌లు పొందుతూ ఆర్థిక ఇబ్బందులు పడుతూ చదువుకుంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇస్తారన్న నోటిఫికేషన్ చిన్న కారణాలతో వాయిదా వేయడం డీఎస్సీ అభ్యర్థులను మానసింగా కుంగదీయడమే అవుతుందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల పక్షాన ఆలోచించి కోర్టు సమస్యలను సత్వరమే పరిష్కరించి డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసి సకాలంలో పరీక్షలు నిర్వహించి పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నిరుద్యోగుల ఆగ్రహావేశాలకు గత వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం గురైనట్లు టిడిపి కూటమి ప్రభుత్వానికి తప్పదని హెచ్చరించారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : డీఎస్పీ

ప్రజాశక్తి-కుందుర్పి

విధి నిర్వహణలో గతి తప్పిన పోలీసులను గాడిలో పెడతానని, మండలంలో అసాంఘిక శక్తుల పై ఉక్కుపాదం మోపుతామని డీఎస్పీ పి.రవిబాబు స్పష్టం చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం డీఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొందరు పోలీసు అధికారులు, సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతూ పోలీస్ వ్యవస్థకు చెడ్డపేరు తెస్తున్నారన్నారు. కొందరు సీనియర్ పోలీసు అధికా రులు అసాంఘిక శక్తులతో చేతుల కలపడం వల్ల ఎంత ప్రయత్నం చేసినా ఫలితం వాటిని నియంత్రిం చలేకపోయామన్నారు. అందిన ఫిర్యాదుల మేరకు ఇప్పటికే కొందరికి తాఖీదులు జారీ చేశామన్నారు. మండలంలో నెలలోపు అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామన్నారు. అనంతరం పెండింగ్ కేసులపై ఆరా తీసి త్వరగా పరిష్కరించాలని ఎస్ఐ నగేష్‌ను ఆదేశించారు. సమావేశంలో ఏఎస్ఐ విజయ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ అక్కులన్న, పోలీసులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తి సహకార సంఘాలతో ప్రయోజనం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రైతు ఉత్పత్తి సహకార సంఘాల ద్వారా రైతులకు ప్రయోజనం అని ఎడిఎ రవి తెలిపారు. మండలంలోని రేకులకుంట గ్రామంలో బుధవారం నాడు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఒక గ్రూప్‌గా ఏర్పడి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేసుకోవాలన్నారు. వారు పండించిన పంటలను సంఘం బ్రాండ్ పేరు మీద అమ్మకాలు చేసుకోవాలన్నారు. రైతులు దళారుల బారిన పడకుండా నాణ్యమైన ఉత్పత్తులను అమ్మకాలు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమ అధికారి ఓబుళరెడ్డి, వ్యవసాయధికారి శ్యాంసుందర్, సహాయకురాలు జ్యోష్ణ, ప్రకృతి వ్యవసాయం సహాయకులు ఉమశంకర్ పాల్గొన్నారు.

షెడ్యూల్ మేరకు ఉద్యోగోన్నతులు చేపట్టాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



డిఇఒకు వినతిపత్రం అందిస్తున్న ఎస్టీయూ నేతలు

ప్రభుత్వం చేపట్టిన పురపాలక నగరపాలక ఉపాధ్యాయుల పదోన్నతులు షెడ్యూల్ మేరకు నిర్వహించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజ నేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఎస్‌టియు ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాద్ బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పురపాలక, నగరపాలక ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల షెడ్యూల్ ఇది వరకే వచ్చినందున ఈ రోజు జరగాల్సిన ప్రధానోపాధ్యాయులతోపాటు, పాఠశాల సహాయకుల ఉద్యోగోన్నతులు షెడ్యూల్ మేరకు చేపట్టాలని తెలిపారు. మొత్తం ఖాళీలను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఆర్‌డిఎంఎ ఉద్యోగోన్నతి ప్రక్రియలో ఎక్కడ రోస్టర్ ఆగిందో రికార్డులను పరిశీలించి వాటిని కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సూర్యుడు, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, సీనియర్ నాయకులు అజయ్ కుమార్, నగర అధ్యక్షులు ప్రభాకర్, వన్నూరప్ప, మల్లికార్జున, యుగంధర్, మురళీకష్ణ, విరుపాక్షి గౌడ్, రామకష్ణ, నౌషద్, ఖలిముల్లా ఖాన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

మరమ్మతు చేయమంటే.. గోడ కట్టేశారు..!

ప్రజాశక్తి-పుట్లూరు



సుబ్బరాయుడుసాగర్ డ్యాం గేట్ వద్ద నిర్మించిన గోడ

మండలంలోని సుబ్బరాయుడుసాగర్ షట్టర్లను మరమ్మతులు చేయాల్సి ఉండగా హెచ్‌ఎల్‌సి అధికారులు ఏకంగా గోడ నిర్మించడంపై రైతుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వివరాలు.. సుబ్బరాయుడుసాగర్‌కు ఏర్పాటు చేసిన 2 గేట్లలో ఒక గేటు ద్వారా నీరు లీకేజ్ అవుతుంది. దీంతో షెట్టర్లను మరమ్మతులు చేయాల్సి ఉండగా హెచ్‌ఎల్‌సి అధికారులు ఏకంగా గోడ కట్టేశారు. దీంతో సుబ్బ రాయుడు సాగర్ డ్యాం నుంచి పుట్లూరు, కోమటికుంట్ల, గరుగు చింతలపల్లి, బొప్పేపల్లి చెరువులకు నీరు ఎలా విడుదల చేస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు. 11 నెలలుగా ఖాళీగా ఉన్నామని, తీరా డ్యాంకు నీరు వచ్చేటప్పుడు షట్టర్లను మరమ్మతులు చేయకుండా ఇలా గోడ కట్టడం విడ్డూరంగా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా హెచ్‌ఎల్‌సి అధికారులు ఆ గోడను తొలగించి షట్టర్లను మరమ్మతులు చేసి నీరు విడుదల చేయాలని మండల రైతుల కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నార్పల విద్యార్థులు

ప్రజాశక్తి-నార్పల



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రవికుమార్ తెలిపారు. నెట్‌బాల్ అండర్-17లో రామ్‌చరణ్, అండర్-14లో సాయి మాధవ్, బేస్ బాల్ అండర్-17లో హేమంత్ కుమార్ రెడ్డి, అండర్-14లో గురుప్రవీన్‌కుమార్, సాఫ్ట్ బాల్ అండర్-14లో మహేష్, హాకీ అండర్-14లో మహ్మద్ అవేజ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని పిడి ఆంజనేయులు, పిఈటి నసీమ బేగ, ఉపాధ్యాయులు అభినందించి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.



శస్త్రచికిత్స చేసిన వ్యక్తితో కిమ్స్ సవీరా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది

పగిలిన రక్తనాళం అతికించిన వైద్యులు

'ఆరోగ్యశ్రీ' ద్వారా కిమ్స్ సవీరాలో ఉచిత చికిత్స

ప్రజాశక్తి-అనంతపురం

తీవ్రమైన ఆయాసం, దగ్గితే రక్తం పడుతున్న 62 ఏళ్ల వ్యక్తికి బుధవారం నగరంలోని కిమ్స్ సవీరా ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ మూడే సందీప్ తెలిపిన వివరాలు.. ధర్మవరం పట్టణానికి చెందిన 62 ఏళ్ల రైతు 3 నెలలుగా తీవ్రమైన ఆయాసంతో బాధపడుతున్నారు. దగ్గుతుంటే నోట్లోంచి రక్తం పడేది. ఈయనకు ఇంకా పలు ఆరోగ్య సమస్యలు ఉండేవి. ఆసుపత్రికి రాగా ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ యశోవర్ధన్ మంగిశెట్టి ఆధ్వర్యంలో పరీక్షలు చేసి ఊపిరితిత్తులకు వెళ్లే రక్తనాళాల్లో ఒకటి పగిలినట్లు గుర్తించారు. అరగంట పాటు శస్త్రచికిత్స చేసి రక్తనాళాన్ని సరి చేశారు. ఈ సమస్యకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ. 2 లక్షలు ఖర్చవుతుంది. కానీ మేము ఆరోగ్యశ్రీ కింద పూర్తి ఉచితంగా చేశామని తెలిపారు. ఆయనతో పాటు డాక్టర్ మంగిశెట్టి యశోవర్ధన్, ఆసుపత్రి యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆర్‌ఆర్' ఫర్టిలైజర్స్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం



ప్రారంభోత్సవం సందర్భంగా మొదటి బిల్లు చేసిన రైతు కిరణ్

నగరంలోని బళ్లారి రోడ్డులో ఉన్న ఆగ్రోస్ ఎదు రుగా నూతనంగా నిర్మించిన ఆర్‌ఆర్ ఫర్టిలైజర్స్ షోరూంను బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. నిర్వాహకులు రాజేష్, రాము మాట్లాడుతూ 15 ఏళ్లుగా జిల్లా రైతుల ఆదరణతో ఆర్‌ఆర్ ఫర్టిలైజర్స్ నూతన షోరూంను ప్రారంభిం చామని తెలిపారు. తమ షోరూంలో పురుగుమందులు, ఎరువులు, విత్తనాలు లభిస్తాయని తెలిపారు. రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ అన్ని రకాల పంటలను కాపాడేందుకు అవసరమైన మందులు అందజేస్తామని తెలిపారు. వ్యవసాయం తోటల సంరక్షణలో విశ్వసనీయ భాగస్వామిగా ఆర్‌ఆర్ ఫర్టిలైజర్స్ రైతులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు లక్ష్మీ నారాయణ, భాస్కర్, తాతిరెడ్డి, ప్రతాపరెడ్డి, ప్రముఖులు పాల్గొన్నారు.

జనసేనపార్టీ కార్యకర్తకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-పెద్దపప్పూరు



నాగరాజుకు ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

పెద్దపప్పూరుకు చెందిన జనసేన పార్టీ కార్యకర్త తలారి ఆటో నాగరాజు ప్రమాదవశాత్తూ బైక్‌పై నుంచి పడడంతో చేయి విరిగింది. విషయం తెలుసుకొన్న తాడిపత్రి జనసేన పార్టీ ఇన్‌ఛార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి ఆ గ్రామం వెళ్లి నాగరాజును పరామర్శించి రూ. 10వేలు అందజేశారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌ఛార్జి బయపురెడ్డి, నాయకులు పవన్, నరసింహులు, గౌస్, ఓబులేసు, జనసైనికులు పాల్గొన్నారు.

'శ్రీచైతన్య' పాఠశాలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీచైతన్య విద్యాసంస్థల ఛైర్‌పర్సన్ ఝాన్సీ జన్మదినం సందర్భంగా బుధవారం నగరంలోని శ్రీచైతన్య విద్యాసంస్థల్లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విజయవంతమైనదని ఎజి ఎం సుబ్బారెడ్డి తెలిపారు. ఎజిఎం మాట్లాడుతూ మెగా రక్తదాన శిబిరానికి జిల్లా నలుమూలల నుంచి విశేష స్పందన లభించినదన్నారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల ఉద్యోగులతో పాటు మిత్రులు, శ్రేయోభి లాషులు 126 మంది రక్తదానం చేశారన్నారు. శ్రీనిత వాలంటరీ బ్లడ్ బ్యాంక్ వారు కిట్లు అందజే యగా, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సహకారంతో రక్త దాతలకు పండ్లు సమకూర్చారు. కార్యక్రమంలో శ్రీచైతన్య స్కూల్స్ ప్రిన్సిపల్స్, కోఆర్డినేటర్స్, డీన్‌లు, ఉపాధ్యాయులు, శ్రీచైతన్య జూనియర్ కాలేజీ డీన్, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న 'శ్రీచైతన్య' పాఠశాల యాజమాన్యం

సాగునీటి వనరుల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి-శింగనమల

జిల్లాలో నీటి వనరుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని, అందుకు అవసరమైన నిధులను రానున్న రాష్ట్ర బడ్జెట్లో కేటాయించేలా చొరవ తీసుకోవాలని సిపిఎం ప్రతినిధుల బృందం కోరింది. జిల్లా వ్యాప్తంగా చెరువులు, కుంటలకు సాగునీరివ్వాలని, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలు, రిజర్వాయర్లు, ప్రాజెక్టుల భూసేకరణకు అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. ఈ మేరకు బుధవారం అనంతపురం నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, జిల్లా కమిటీ సభ్యులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి వినతి పత్రం అందజేశారు. వి.రాంభూపాల్ మాట్లాడుతూ తుంగభద్ర ఎగువ కాలువ ఆధునీకరణ పనులు పూర్తి చేయాలని, 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో నీరు ప్రవహించేలా హంద్రీనీవా కాలువను వెడల్పు చేయాలని, హంద్రీనీవా పంట కాలువల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని కోరారు. జిల్లాలో కరువును పారదోలాలంటే జాతీయ ఇరిగేషన్ కమిషన్, జయతీ ఘోష్ కమిషన్, స్వామినాథన్ ఫౌండేషన్, ఐసిఆర్ న్యూ ఢిల్లీ కమిటీల నివేదికలు, సూచనల మేరకు నదీ జలాలను మళ్లించడం, ఉన్న నీటి వనరులను పూర్తిగా వినియోగించుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కర్నాటక ప్రభుత్వంతో చర్చించి తుంగభద్ర డ్యాంకు కొత్త గేట్లు ఏర్పాటు చేయాల న్నారు. వారితో పాటు బుక్కరాయసముద్రం, గార్లదిన్నె మండలాల కార్యదర్శులు ఆర్.కుళ్లాయప్ప, చెన్నారెడ్డి, సిఐటియు మండల కార్యదర్శి సి.నాగేంద్ర, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు సిపిఎం వినతులు



ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

కళ్యాణదుర్గం : జిల్లాలో సాగునీటి అభివృద్ధికి నిధులు కేటాయించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్ ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రజావేదిక వద్ద ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సూర్యకు మండల, పట్టణ కార్యదర్శులు రంగనాథ్‌తో కలిసి వినతి పత్రం అందజేశారు. శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో జీడిపల్లి రిజర్వాయర్ నుంచి కుందుర్పి బ్రాంచ్ కెనాల్‌కు నీటిని తెచ్చే అంశాన్ని లేవనెత్తాలని డిమాండ్ చేశారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల రైతులకు సాగునీరందిం చేందుకు పనులను వెంటనే ప్రారంభించాలని, చెరువులు, కుంటలను నీటితో నింపాలని కోరారు. కాలువల ద్వారా సాగునీరందని గ్రామాల రైతులకు ప్రత్యేక పైపులైన్ ద్వారా నీరందించేందుకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే చొరవతో వేగంగా అభివృద్ధి : జడ్పిటిసి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పిటిసి ప్రభావతమ్మ

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారని జడ్పిటిసి ప్రభావతమ్మ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో జడ్పిటిసితో పాటు ఎంపిపి చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపిపిలు వెంకటేష్‌నాయక్, సునందమ్మ పాల్గొన్నారు. జడ్పిటిసి మాట్లాడుతూ నియోజకవర్గంలో గత ఐదేళ్లలో ఏమాత్రం అభివృద్ధి జరగలేదని, ప్రస్తుతం ఎమ్మెల్యే వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. పలు వురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు కళ్యాణదుర్గం నుంచి కన్నేపల్లి రోడ్డు విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. స్పందించిన జడ్పిటిసి ఎమ్మెల్యే 4 నెలల్లో రోడ్డు వేయిస్తారని హామీ ఇచ్చారు. మండలంలో తాగునీటి సరఫరా, పారిశుధ్యం, కుళాయిలపై దృష్టి సారించాలన్నారు. అందుకు ప్రధానంగా పంచాయతీ కార్యదర్శి, సర్పంచులే పూర్తిగా బాధ్యత వహించాలన్నారు. తర్వాత జరిగే జనరల్ బాడీ మీటింగ్ లోపు సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు కోరారు. సమావేశంలో ఎంపిడిఒ నందకిషోర్, తహశీల్దార్ సుమతి, ఈఓపిఆర్డి వెంకటరమణ, బొమ్మగానిపల్లి సర్పంచి ఆదినారాయణరెడ్డి, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి ప్రజా సమస్యలపై 'సిపిఎం ప్రజాపోరు'

ప్రజాశక్తి- రాప్తాడు



సిపిఎం జెండాను ఎగురవేసిన నాయకులు

ప్రజా సమస్యలపై ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకూ సిపిఎం ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రజా పోరు కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షులు ఎం.పోతులయ్య, కార్యదర్శి టి.రామాంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక ఆర్డీటీ పాఠశాలలో బుధవారం సిపిఎం మహ సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం పోరాటం చేస్తుందన్నారు. ప్రధానంగా అధిక ధరలు, మహిళలపై అత్యాచారాలు, నిరుద్యోగం, ఉపాధి పనులు, సాగు, తాగునీరు, పంటల బీమా, తదితర సమస్యలపై ప్రభుత్వంతో పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు చంద్రిక, పుష్పరాజు, సభ్యులు నారాయణమ్మ, పెద్దిరాజు, ఆదినారా యణ, వన్నూరుస్వామి, సుబ్బారావు, నారాయణ స్వామి, వెంకటరాముడు, నాగరాజు, ప్రతాప్, తిరుపాలు, రాయమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

పివికెకె విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-అనంతపురం



ఉద్యోగాలకు ఎంపికైన పివికెకె విద్యార్థులు

నగర శివారులోని ఆలమూరు రోడ్డులో ఉన్న పివికెకె కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్న పది మంది విద్యార్థులు రాయల్ ఎన్‌ఫీల్డ్, హోండా, టివిఎస్ సంస్థల్లో ఉద్యోగాలు సాధించారు. ప్రిన్సిపల్ డా.బండి రమేష్‌బాబు మట్లాడుతూ కళాశాలలో ఉన్న శిక్షణ సౌకర్యాలు, మార్గదర్శకులు, పరిశ్రమలతో కళాశాల అనుసంధానం వంటి విధానాల వల్ల విద్యార్థులకు ఉన్నత ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయన్నారు. ఎంపికైన వారిని కళాశాల ఛైర్మన్ డాక్టర్ పల్లె కిషోర్, ప్రిన్సిపల్ డాక్టర్ బి.రమేష్‌బాబు, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ బాల సుబ్రహ్మణ్యం, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జి.ప్రశాంత్ కుమార్, సహాయ ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఆనంద్ అభినందించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-గుత్తి




సానియాను సన్మానించిన శ్రీసాయి కళాశాల ప్రిన్సిపల్

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉద్యోగావకాశాలు దక్కుతాయని శ్రీ సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. కళాశాలలో డిగ్రీ(బీఏ) ద్వితీయ సంవత్సరం చదువుతున్న సానియా గుంతకల్లులో జరిగిన తైక్వాండో ఇంటర్ కాలేజీ టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైంది. దీంతో బుధవారం కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. సానియాకు శాలువా కప్పి సత్కరించి బహుమతి అందజేశారు. డాక్టర్ సి.వెంకటేశ్వర్లు రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడల ద్వారా ఉజ్జల భవిష్యత్తు ఉంటుందన్నారు. సానియా జాతీయస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, బోధినేతర సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి- తాడిపత్రి



వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి

ఎమ్మెల్యే జేసీ.అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి బుధవారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. టైలర్స్ కాలనీ, పద్మవాణి స్కూల్ ప్రాంతాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అలాగే 26, 27 వార్డుల ప్రజలను కలిసి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. అండర్ డ్రెయినేజీ నిర్వహణ, పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించి విజ్ఞప్తి చేశారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని వార్డు సభ్యులకు తెలిపారు. పద్మవాణి స్కూల్ బ్యాక్ సైడ్ వద్ద కొత్తగా వేస్తున్న రోడ్డు పనులను పరిశీలించి నాణ్యతగా చేపట్టాలని గుత్తేదారులకు సూచించారు. వారి వెంట మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, టిడిపి కౌన్సిలర్లు ఉన్నారు.

పశువైద్యులను నియమించాలి

నార్పల : మండలంలోని పాడి రైతులకు పశువైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకుడు పుల్లప్ప ఆధ్వర్యంలో తహశీల్దార్ అరుణ కుమారికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ వెంటనే వెటర్నరీ ఉన్నతాధికారులతో మాట్లాడి నార్పలకు ఇద్దరు రెగ్యులర్ వైద్యులను, పప్పూరు వైద్యశాలకు వైద్యుడిని నియమించాలని కోరారు. నార్పలలో ఇటీవల కాలంలో చోరీలు అధికమయ్యాయని, వీధి దీపాలు వెలగడం లేదని, తదితర సమస్యలను వివరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పుల్లప్ప, గోపాల్, రాజు, కుళ్లాయప్ప, ఆర్,రాజు, తదితరులు పాల్గొన్నారు.

11న 'గేట్స్'లో కంటి వైద్యశిబిరం

గుత్తి : ఈ నెల 11వ తేదీ పట్టణ శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ వీకే.పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ఎండి జి.రఘునాథ్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీకే.సుధీర్‌రెడ్డి 7వ వర్ధంతి సందర్భంగా సక్షం స్వచ్ఛంద సంస్థ తోడ్పాటుతో ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

యాడికి ఎస్‌ఐగా రమణ

యాడికి : స్థానిక అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌ఐగా బుధవారం రమణ బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా అనంతపురం విఆర్‌లో ఉన్న రమణ బదిలీపై యాడికి మండలానికి వచ్చారు. నూతన ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పర్యవేక్షణ చేస్తానని తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధులు ఓబయ్యకు నివాళి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలో బుధవారం నిర్వహించిన స్వాతంత్ర్య సమరయోధులు ఇండియన్ ఓబయ్య వర్ధంతి కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా పాల్గొని, ఆ మహనీయుని త్యాగాలను గుర్తు చేసుకొని నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాల ఎర్రిస్వామి, వైసిపి నాయకులు ఐ.సుధీర్, బోయ నాగరాజు, కాంగ్రెస్ దాదా, మంజు, రఘు, తిరుమల వెంకటేశులు, శ్రీనివాసులు, అల్తాఫ్, కె.ఉద్దీప్‌సింహా, షేక్షావలి, అబ్రహం పాల్గొన్నారు.

హాకీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని కరణం చిక్కప్ప హైస్కూల్‌లో బుధవారం 'కళ్యాణదుర్గం హాకీ క్లబ్ అసోసియేషన్' ప్రెసిడెంట్ రాజు, బాబు, ట్రెజరర్ ప్రజాశక్తి రఘు రూ. 25వేల విలువ చేసే హాకీ సామగ్రిని అందజేశారు. కంబదూరు హైస్కూల్ పిడి లలిత, హాకీ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రెటరీ ఎంఎస్ అక్రమ్‌బాషా విన్నపం మేరకు అసోసియేషన్ ఆధ్వర్యంలో హాకీ మెటీరియల్‌ను చిక్కప్ప హూస్కూల్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం శ్రీదేవి ద్వారా అందజేశారు. పిడి లలిత మాట్లాడుతూ అడిగిన వెంటనే హామీ సామగ్రి అందజేసిన చిక్కప్ప స్కూల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చిక్కప్ప స్కూల్ పిడిలు రమేష్, కుళ్లాయప్ప, సీనియర్ కోచ్‌లు అరవింద్, అఖిల పాల్గొన్నారు.

నేడు నగరంలో ఎమ్మెల్యే పర్యటన

అనంతపురం రూరల్ : 'మీ ఇంటికి మీ ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకూ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వ ప్రసాద్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. నగరంలో పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా ఎమ్మెల్యే పలు డివిజన్లలో పర్యటిస్తారని తెలిపారు.

బెల్టుషాపు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-పుట్లూరు



సిఐ సత్యబాబు

మండలంలో గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని సిఐ సత్యబాబు హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌లో బుధవారం సిఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. తొలుత బైండోవర్ చేస్తామని, పునరావృతమైతే రూ. 3 లక్షల జరిమానా విధించి జైలుకు పంపిస్తామని తెలిపారు.

ఇళ్లపై విద్యుత్ తీగలు తొలగించాలి

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో పల్లె సాంబ, పల్లె లక్ష్మీనారాయణ ఇళ్ల మీదుగా వెళ్తున్న విద్యు త్ తీగలను తొలగించి పక్కకు మార్చాలని కోరుతూ బుధవారం ఏఈకి విజ్ఞప్తి చేశారు. గ్రామంలో ఇళ్లపై విద్యుత్ తీగలు ఉండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ తీగలను పక్కకు మార్చాలని మండల అధ్యక్షుడు ఆర్.రామంజి యాదవ్ కోరారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని శనగలగూడూరు, గాండ్లపాడు గ్రామాల్లో ఎడిఎ చెంగళరాయుడు ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పప్పుశనగ సాగులో యాజమాన్య పద్ధతులు, సమగ్ర సస్యరక్షణ చర్యలు, తెగుళ్ల నివారణ చర్యలను వివరించారు. పప్పు శనగ పంట వేసిన రైతులు ఎకరాకు రూ. 450 ఇన్సూరెన్స్ డిసెంబర్ 15వ తేదీ లోపు చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏవో కాత్యాయిని, ఎఇఒ హరి, విహెచ్ఎ రామలక్ష్మి, విఎఎ భార్గవి, రైతులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తులు పోలీసులకు అప్పగింత

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని నిదనవాడ గ్రామంలో మంగళవారం రాత్రి తలకు లైట్ కట్టుకొని వ్యవసాయ తోటల వద్ద సంచరిస్తున్న ఆరుగురు గుర్తుతెలియని వ్యక్తులను గ్రామస్తులు పట్టుకున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామస్తులు వారిని విచారించగా మాది గోపరాజుపల్లి గ్రామమని, రాత్రి వేళ కుందేలు వేటకు వచ్చాని తెలిపారు. వారిని బుధవారం ఉదయం శింగనమల సిఐ కౌలుట్లయ్య, ఎస్‌ఐ శరత్‌చంద్రకు అప్పజెప్పారు. ఈ విషయం తెలుసుకుని ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో స్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఆ ఆరుగురు చోరీ చేసేందుకు వచ్చారా లేక వేటకు వచ్చారా అనే కోణంలో విచారణ చేపడతామని పోలీసు అధికారులు తెలిపారు.

విడపనకల్లులో దొంగల హల్‌చల్

ప్రజాశక్తి-ఉరవకొండ

మండల కేంద్రమైన విడపనకల్లులో దొంగలు ఒకే రోజు పల షాపుల్లో చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. దొంగలు తాళాలు పగలగొట్టి అమృత ఏజెన్సీ ఫర్టిలైజర్స్ షాపులో రూ. 4వేలు నగదు ఎత్తుకెళ్లారు. అలాగే వర వినాయక ఫర్టిలైజర్స్, వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ షాపుల్లోకి ప్రవేశించినా ఏమీ లభించకపోవడతో వెళ్లిపోయారు. అలాగే జనరల్ స్టోర్‌లో సిగరెట్ డబ్బాలు ఎత్తుకెళ్లారు. మరో దుకాణంలో రూ. 2వేలు ఎత్తుకెళ్లారు. ఆయా షాపుల యజమానుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



తిరుమలలో ప్రమాణస్వీకారం అనంతరం కుటుంబ సభ్యులతో టిటిడి సభ్యులు రాజు

టిటిడి సభ్యులుగా ఎమ్మెల్యే రాజు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-శింగనమల

ఎమ్మెల్యే ఎంఎస్.రాజు బుధవారం తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో టిటిడి సభ్యులు గా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆయన భార్య ఉమాదేవి, కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ శ్రీవేంకటేశ్వరస్వామికి సేవ చేసుకునే భాగ్యం కలిగించిన సిఎం చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలిపారు. టిటిడి ఛైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో సినీ నటుడు దస్తగిరి, జబర్దస్త్ రఘు, నిర్మాత సంతోష్, ఎంపి బికె.పార్థసారధి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, దస్తగిరి, జయసూర్య, మద్దిపాటి వెంకటరాజు, తంగిరాల సౌమ్య, రాష్ట్ర నాయకులు రామలింగారెడ్డి, రాయల్ మురళి పాల్గొన్నారు.

అంగన్వాడీ సహాయకులకు నియామక ఉత్తర్వులు

నార్పల : స్థానిక సిడిపిఒ కార్యాలయంలో బుధవారం సిడిపిఒ భారతి నూతనంగా ఎంపికైన అంగన్వాడీ సహాయకులకు ఉత్తర్వులు అందజేశారు. వారిలో తేజేశ్విని పుట్లూరు మండలంలోని గూడూరు అంగన్వాడీ-2 సహాయకురాలుగా, కాంతమ్మ పుట్లూరు-2 అంగన్వాడీ సహాయకురాలిగా, విజయశ్వరి నార్పల తిక్కస్వామివీధి అంగన్వాడీ-2 సహాయకురాలుగా ఎంపికైనట్లు సిడిపిఒ తెలిపారు.

వివాహానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-శింగనమల



ఆర్థికసాయం అందజేస్తున్న వంశీగోకుల్‌రెడ్డి

మండలంలోని తరిమెల గ్రామానికి చెందిన నడిమింటి నాగేంద్ర కుమార్తె నందిని వివాహానికి వైసిపి నాయకుడు తరిమెల వంశీగోకుల్‌రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. వంశీ రూ. 10వేలను ఆ గ్రామ సర్పంచి బిల్లగండ్ల ఓబులేసు ద్వారా నాగేంద్రకు అందజేశారు. తరిమెల గ్రామంలో ఏ కుటుంబంలో శుభకార్యం జరిగినా తన వంతుగా ఆర్థిక సాయం చేస్తానని తెలిపారు.